J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 01.05.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 48 పేజీలు : 12, వెల : ₹ 5

లాక్‌డౌన్‌తో.. గత 40రోజులుగా మూగబోయిన

# నిశ్శబ్ద నెల్లూరు

3లో




ఆత్మకూరు బస్టాండు కూడలి


మరిన్ని దృశ్యాలు 6, 7 పేజీలలో...




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

# మారుతున్న భారతం



కరోనా మహమ్మారి వ్యాధి ప్రపంచాన్ని వణికిస్తున్న నేపథ్యంలో.. మనదేశంలోనూ ఆ వ్యాధి విజృంభిస్తూ ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రధాని మోడీ తీసుకున్న సంచలనాత్మక నిర్ణయం..'లాక్‌డౌన్'. సరిగ్గా ఈ లాక్‌డౌనే కరోనా రాకాసిని కట్టడిచేసే ఆయుధంగా అద్భుతంగా పనిచేస్తోంది. ప్రపంచదేశాలతో పోలిస్తే మనదేశంలో ఈ వ్యాధి జోరు తక్కువగా ఉండడమే అందుకు నిదర్శనం. దాదాపు **130** కోట్ల మందికి పైగానే జనాభా ఉన్న మనదేశంలో ఇంతపెద్దఎత్తున లాక్‌డౌన్ పాటించడం దేశచరిత్రలోనే ఒక సంచలనం. అయితే, కరోనా మహమ్మారి ప్రజలందరినీ ఆందోళనకు గురిచేస్తున్నా, లాక్‌డౌన్‌తో అందరూ ఇళ్ళలో ఉండడం ద్వారా భారతదేశంలో, భారతీయుల జీవనవిధానంలో ఎవరూ ఊహించలేని విధంగా ఎన్నో మంచి మార్పులు జరుగుతుండడం ఎంతైనా విశేషం.

కంటికి కనిపించని సూక్ష్మ రూపంలో వచ్చి ప్రాణాలు తీసే రాకాసి వైరస్ కోవిడ్-19. కరోనా మహమ్మారికి సంబంధించిన ఈ వైరస్‌తో ఇప్పుడు ప్రపంచమే భీతిల్లిపోతోంది. అగ్రరాజ్యమైన అమెరికాలో ఇప్పటికే కరోనాతో ప్రాణాలు కోల్పయిన వారి సంఖ్య 60 వేలు దాటిందంటే పరిస్థితి ఎంత విషమంగా ఉందో ఊహించుకోవచ్చు. ఇంకా దాదాపు 10 లక్షలా 40వేల మందికి పైగానే అమెరికన్లు ఈ వైరస్‌తో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రపంచంలోని ఇంకా అనేకదేశాల్లో కరోనా ప్రమాద ఘంటికలను మోగిస్తూనే ఉంది. నిత్యం వేలాదిమంది ప్రజలు ప్రాణాలు కోల్పోతూనే ఉన్నారు. ఏప్రిల్ 29వ తేది నాటికి ప్రపంచవ్యాప్తంగా 31,88,027 మంది కరోనా సోకి అల్లాడుతుంటే, ఇప్పటికే 2,25,606 మంది మృతిచెందారంటే కరోనా రాకాసి ఎంతగా విజృంభిస్తోందో చెప్పవచ్చు. మనదేశంలోనూ కరోనా వ్యాధి ఉన్నప్పటికీ దాని ఉధృతి మాత్రం మిగతాదేశాల్లో మాదిరిగా భారీగాలేదు. ఏప్రిల్ 30 నాటికి మనదేశంలో 33,050 కేసులు నమోదైతే, ఇప్పటి వరకు 1074 మంది మరణించారు. కరోనా వ్యాధి ప్రపంచవ్యాప్తంగా (మిగతా 11వ పేజీలో)



## సడలింపులతో.. పొడిగింపు...

జూన్ దాకా కొనసాగింపు

11లో

## ఇంకొన్నాళ్ళు... మనతోపాటే కరోనా

11లో - ముఖ్యమంత్రి వైయస్ జగన్



### శ్రీసిటీ కార్మికులకు
# మెరుగైన భద్రత కల్పించాలి
**- రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి**



శ్రీసిటీ సెజ్‌లోని కంపెనీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు మెరుగైన భద్రత కల్పించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటి శాఖల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి అన్నారు. శ్రీసిటీలోని కంపెనీల్లో కార్మికుల విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలు, భద్రత గురించి అడిగి తెలుసుకున్నారు. ఈనెల 27న ఆయన శ్రీసిటీలోని క్రయోజనిక్ ట్యాంకుల తయారీ పరిశ్రమ విఆర్‌వి ఆసియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు కంపెనీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లిష్ట సమయంలో కరోనా వైరస్ నియంత్రణకు అవసరమైన వస్తువులను ఉత్పత్తి చేస్తున్న పరిశ్రమలకు మంత్రి అభినందనలు తెలిపారు. వివిధ మండలాల నుంచి పరిశ్రమల్లో పనిచేసేందుకు వచ్చే ఉద్యోగుల రాకపోకలకు ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీ పోలీసులు, పరిశ్రమల వర్గాల వారి సహకారం, కట్టుదిట్టమైన చర్యల ఫలితంగా కరోనా రహిత ప్రాంతంగా శ్రీసిటీ కొనసాగుతోందని తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ప్రసాద్, చిత్తూరు పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, శ్రీసిటీ డిఎస్పీ విమలకుమారి పాల్గొన్నారు.

### జగనన్న విద్యాదీవెనకు
# 4వేల కోట్లు విడుదల
**- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న**



ఆర్థిక లోటు వున్నా జగనన్న విద్యా దీవెనకు రూ. 4 వేల కోట్లు విడుదల చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. గత నెల 28న కొడవలూరు మండలం కమ్మపాళెం పంచాయితీలోని సంజీవనగర్, గుర్రాల దిన్నెల్లోని 300 కుటుంబాలకు వైయస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి నాపా వెంకటేశ్వర్లు నాయుడు తన తల్లి వెంకటశేషమ్మ జ్ఞాపకార్థం బియ్యం, కూరగాయలు, పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు హయాంలోని రూ.1880 కోట్ల బకాయిలను సీఎం చెల్లించారని తెలిపారు. అనంతరం సంజీవనగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పూజారికి వెంకటేశ్వర్లు నాయుడు రూ.5వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. డీసీఎంయస్ ఛైర్మన్ వీరి చలపతిరావు, వైయస్సార్ సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, కిశోర్ నాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# సేవాభావం చాటుకున్న డాక్టర్ సునీల్
**- చెన్నైలో 5వేల మందికి కూరగాయలు, పండ్లు పంపిణీ**



లాక్‌డౌన్ నేపథ్యంలో పేదప్రజలు ఇబ్బందులు పడకుండా చెన్నైలోని ఉంగలుకాగ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో చెన్నై టి.నగర్‌లోని ముప్పత్తమన్ ఆలయం సమీపంలోని రాజాపిళ్లై తొట్టం తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న సుమారు 5 వేల మంది ప్రజలకు కూరగాయలు, పండ్లు పంపిణీచేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఏఐడిఎంకె ఎంజిఆర్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి కుటుంబానికి ఒక బస్తా కూరగాయలు, పండ్లు అందజేశారు. రెండు లారీల కూరగాయలు, పండ్లు పంపిణీ చేసి పేదలకు తమవంతు సాయం అందించారు.

### ఇంజినీరింగ్ చదువులకు..
# ఫీజులు నిర్ణయించేశారు



***ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉన్నత విద్య ఫీజు రెగ్యులేటరీ కమిషన్ సభ్యులు అందజేసిన నివేదిక ప్రకారం 2019-2020 విద్యా సంవత్సరానికి జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి ఫీజులు నిర్ణయించింది.***

ఇంజినీరింగ్ చదివే ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా దీవెన కింద కళాశాలలను బట్టి రూ.35వేల నుంచి రూ. 70 వేల వరకు ఫీజును ఆయా కళాశాలలకు ప్రభుత్వం అందజేయనుంది. నెల్లూరుజిల్లా కోట మండలం విద్యానగర్‌లో వున్న ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు రూ. 70వేలు ఫీజు నిర్ణయించారు. నెల్లూరులోని నారాయణ కళాశాలకు రూ.40,800లు, గూడూరులోని నారాయణ కళాశాలకు రూ.45 వేలు, గూడూరులోని ఆదిశంకర కళాశాలకు రూ. 48,600లు, ఆదిశంకర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు రూ.40 వేలు, కావలిలోని పీబీఆర్ విశ్వోదయ కళాశాలకు రూ. 42,500లు, కావలిలోని ఆర్‌ఎస్సార్ కళాశాలకు రూ.41వేలు, గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలకు రూ. 38 వేలు ఫీజు నిర్ణయించారు. మిగిలిన 12 ఇంజినీరింగ్ కళాశాలలకు మినిమమ్ ఫీజు కింద రూ.35 వేలుగా ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న విద్యా ప్రమాణాలు, మౌళిక సదుపాయాలను మరింత మెరుగు పరిస్తే 2020-21 విద్యా సంవత్సరానికి ఇప్పుడున్న ఫీజును మరింత పెంచే అవకాశం ఉంటుందని సమాచారం.

2018-19, 2019-20 విద్యా సంవత్సరాలకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం గతనెల 28న విడుదల చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజినీరింగ్ విద్యకు సంబంధించిన ఫీజును విద్యార్థి తల్లి బ్యాంక్ అకౌంట్లో జమ చేయనున్నారు.

# 'మెట్ట'నింట అడుగుపెట్టింది!

***జిల్లాలో తూర్పువైపు మండలాలలో కరోనా వైరస్ వున్నా, పడమర పల్లెల్లో లేదనుకున్నాం. వానలే కాదు, వైరస్‌లు కూడా మెట్ట వైపు చూడవను కున్నాం. తీరాచూస్తే కరోనా వైరస్ మెట్ట ప్రాంతాన్ని కూడా వదల్లేదు.***

కొండాపురం మండలం పార్లపల్లిలో ఒక పాజిటివ్ కేసు నమోదైంది. పాజిటివ్ వచ్చిన మహిళ చెన్నై నుండి వచ్చినట్లు తెలిసింది. ఆమె మూలంగా మరికొందరిని క్వారంటైన్‌లో ఉంచారు. ఉదయగిరి నియోజకవర్గంలో 8 మండలాలుంటే తొలుత జలదంకి మండలంలో ఒక కేసు వెలుగుచూసింది. అయితే అది కావలికి సమీప ప్రాంతం. కొండాపురం, కలిగిరి, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, సీతారాంపురం, ఉదయగిరి మండలాలుల మెట్ట క్రిందకు వస్తాయి. ఇప్పటిదాకా ఈ మండలాలలో ప్రజలు చాలా ప్రశాంతంగా వుంటూ వచ్చారు. ప్రపంచమంతా కరోనా వచ్చినా మాకు రాదులే అనేంత ధీమాతో వున్నారు.

ఈ ధీమాతోనే నగరాలు, పట్టణాలలో నివాసముంటున్న ఈ ప్రాంతాలకు చెందిన వాళ్ళు సైతం ఈ కరోనా రోజుల్లో సొంత గ్రామాలకు చేరారు. ఇప్పుడు మెట్టలో కూడా కేసులు వెలుగుచూస్తుండడంతో ఇక్కడి గ్రామాలలోనూ ఆందోళన కలుగుతోంది.

### ప్రాణాలకు తెగించి..
# పోలీసుల విధులు
**- హర్జీత్‌సింగ్‌కు జిల్లావ్యాప్తంగా సంఘీభావం**

కరనా మహమ్మారి ప్రపం చాన్ని వణికిస్తున్న ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలకు రక్షణగా దేశ వ్యాప్తంగా పోలీసులు రోడ్ల పైకి వచ్చి తమ ప్రాణాలకు తెగించి సేవలందిస్తున్నారు. అలాంటి పోలీసులపై దాడులు చేయడం దారుణం.. అమానుషం. పాటియాలాలో విధులు నిర్వహిస్తున్న హర్జీత్‌సింగ్ అనే ఏఎస్‌ఐపై దుండ గులు దాడిచేసి చేయి నరికివేయడం కిరాతకం. ఆ ఏఎస్‌ఐ ఇప్పుడు అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ముష్కరమూకలు చేసిన ఈ దుర్మార్గాన్ని నిరసిస్తూ నెల్లూరు జిల్లా వ్యాప్తంగా పోలీసు ఉన్నతాధికారుల నుంచి సిబ్బంది వరకు అందరూ గతనెల 27న తమ యూనిఫాంపై హర్జీత్‌సింగ్ పేరున్న నేమ్‌ప్లేట్‌ను పెట్టుకుని విధులు నిర్వహించి హర్జీత్‌సింగ్‌కు తమ సంఘీభావాన్ని చాటారు.



### లాక్‌డౌన్‌తో.. గత 40 రోజులుగా మూగబోయిన

# నిశ్శబ్ద నెల్లూరు

***ఎల్లప్పుడూ చక్కని ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణంతో, సాహిత్య, సాంస్కృతిక సభలు సమావేశాలతో, కళారూపాల ప్రదర్శనల కళకళలతో ఎంతో సందడిగా.. కోలాహలంగా ఉండే నెల్లూరు నగరం.. ఇప్పుడు మూగబోయినట్లు.. నిశ్శబ్దంగా ఉండిపోతోంది. కరోనా మహమ్మారి, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో గత 40 రోజులుగా నగరంలో ఎవరిళ్లలో వారుండిపోతుండడంతో నగర వీధులన్నీ నిర్మానుష్యమైపోయాయి. గస్తీకాస్తున్న పోలీసులు, తప్పనిసరై విధులకు హాజరవుతున్న అధికారులు, ఉద్యోగులు, అత్యవసరమైన పనులున్న వారు తప్ప రోడ్లలో మరెవరూ కనిపించడం లేదు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కరోనా మహమ్మారిని నివారించడానికి ప్రతి ఒక్కరూ ఎంతో నిబద్ధతతో.. అకుంఠిత దీక్షతో... నిశ్శబ్ద యుద్ధం చేస్తున్నారు.***

నెల్లూరు ఇప్పుడు మౌనదీక్షలో ఉంది. నిశ్శబ్ద యుద్ధంలో ఉంది. ప్రభుత్వం అందించిన లాక్‌డౌన్ ఆయుధంతో, అందరూ ఇళ్ళలోనే ఉంటూ కనిపించని ఆ రాకాసికి అందకుండా అత్యంత జాగ్రత్తగా ఉంటున్నారు. ఆ విషరాకాసి దానికై అదే మట్టిలో కలసిపోయేదాకా వేచిచూస్తున్నారు. ఇళ్ళలోనే ఉండడమంటే ప్రజలకు ఎన్నో కష్టనష్టాలుంటాయి. ఉపాధి లేక, జీవనోపాధి జరగక అవస్థలు పడడం వంటి పేదల కష్టాలు బోలెడు. అయినా సరే, బీదా గొప్ప తారతమ్యం లేకుండా ఎవరూ ఆ కష్టాలను లెక్కచేయడం లేదు. కరోనా రాకాసి అంతు చూడడానికే అందరూ సంకల్పబద్ధులై ఉన్నారు. ముఖానికి మాస్కులు ధరించడం, తరచూ చేతులు శుభ్రం చేసుకోవడం, శానిటైజర్లు వాడడం, సామాజిక దూరం పాటించడం, ఇళ్ళలో ఉన్నప్పటికీ భౌతికదూరం పాటించడం వంటి నిబంధనలను పాటిస్తూ ఆ రాకాసి వైరస్ తమపై వాలడానికి అవకాశం లేకుండా జాగ్రత్తపడుతున్నారు.

**ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న వైద్యులు :**

కరోనాపై పోరాటంలో వైద్యులు, వైద్యసిబ్బంది మొదటి వరుసలో నిలబడి ప్రాణాలకు తెగించి ఈ వైరస్‌ను ఎదుర్కొంటున్నారు. వారితో పాటు పారిశుద్ధ్య సిబ్బంది చేస్తున్న సేవలు అమోఘం. అంటువ్యాధులు ప్రబలకుండా నిరంతరం వీధులను పరిశుభ్రం చేస్తూ అలుపు సొలుపులేకుండా పని చేస్తున్నారు. ఇక పోలీసుల సేవలు చెప్పనే అక్కరలేదు. రాత్రీపగలు కంటికి కునుకే లేదు. తమ భార్యాబిడ్డలు ఏమైపోతారోననే ఆందోళన కంటే, ప్రజలెక్కడ ఈ విషరక్కసి బారిన పడతారోనని ప్రజలు ఇళ్ళలోంచి బయటకు రాకుండా వీధివీధినా గస్తీ కాస్తున్నారు. అధికారులంతా కరోనా నివారణకే అంకితమయ్యారు.

**కరోనాతో కనువిప్పు**

ఇప్పుడు అందరి ధ్యేయం ఒక్కటే.. ప్రాణాలను హరించే కరోనాను నివారించాలన్నదే. ఒక రకంగా చెప్పాలంటే కరోనా ఎంతోమందికి కనువిప్పు కలిగిస్తోంది. ఇప్పుడెవరూ డబ్బును ప్రధానంగా చూడడం లేదు. మునుపటిలా డబ్బే ప్రధానం అనుకున్నవాళ్ళు కూడా ఇప్పుడు బాగా మారిపోయారు. డబ్బు కంటే.. ఏ జబ్బూ లేకుండా ఉండడమే ముఖ్యమని, ఆరోగ్యమే మహాభాగ్యమని అందరూ తెలుసుకుంటున్నారు. మానవత్వంతో బతకడమే అసలైన జీవితంగా అందరూ గుర్తిస్తున్నారు. మంచి జీవనానికి బాటలు వేసుకుంటున్నారు. ఇంత మార్పు నిజంగా ఎంతైనా అపురూపమే!.. వైరస్ రాకాసిని ఎదుర్కోవడానికి ఏకైక మార్గం లాక్‌డౌన్ పాటించడమే. అందరూ భద్రంగా ఇళ్ళల్లో ఉండడమే! అందుకే నెల్లూరులో కూడా ప్రతిఒక్క పౌరుడూ బాధ్యతాయుతంగా లాక్‌డౌన్ పాటిస్తూ.. కరోనా నివారణకు.. తమవంతు పోరాటం చేస్తున్నాడు. ప్రజలందరూ కలసి నిశ్శబ్ద యుద్ధం చేస్తున్నారు.

## దీవించే వారికి దీనబాంధవుడయ్యాడు


- బీద బ్రాహ్మణులను ఆదుకున్న విపిఆర్



ఈ కరోనా కాలం.. కరువు కాలం కన్నా ఘోరంగా వుంది. దేవాలయాలు మూతపడ్డాయి, పెళ్లిళ్లు లేవు, శంకుస్థాపనలు, గృహప్రవేశాల వంటి శుభకార్యాలు లేవు. ప్రతి ఇంట శుభం జరగాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించే వేదపండితులు, పూజారులు, పేద బ్రాహ్మణులు శుభకార్యాలన్నీ నిలిచిపోవడంతో ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతూ పస్తులుంటున్నారు. ఇలాంటి కాలంలో పేద బ్రాహ్మణులకు విపిఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. ఇటీవల విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో మూడురోజులపాటు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి టీటీడీ పాలకమండలి సభ్యురాలు శ్రీమతి ప్రశాంతిరెడ్డిలు తమ సిబ్బంది ద్వారా వందలాది మంది బీద బ్రాహ్మణులకు పంపిణీ చేయించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

ద్వితీయ వర్ధంతి



జననం: 16.12.1939 శ్రీ గణపం ఓబులరెడ్డి గారు మరణం: 05.05.2018

అమృతమూర్తి దివ్యస్మృతికి మా నివాళి. - కుటుంబసభ్యులు

## 'ప్రభా'తం

# సమైక్య స్ఫూర్తి

పదుల సంఖ్యలో మతాలకు, వందల సంఖ్యలో కులాలకు, వేల సంఖ్యలో భాషలకు, అంతకు మించిన విభిన్న సంస్కృతులకు పుట్టినిల్లు భారతదేశం. ప్రపంచంలో 200కు పైగా దేశాలు ఒక ఎత్తయితే... భారతదేశం ఒక్కటే ఒకెత్తు! ఆ దేశాలన్నింటితో సమానం. ఇలాంటి దేశం ప్రపంచంలో ఇంకెక్కడా కనిపించదు.

చాలా దేశాలలో ఇంగ్లీష్ ప్రధాన భాషగా ఉంటుంది, క్రైస్తవం ఒక్కటే పెద్ద మతంగా ఉంటుంది. కొన్ని దేశాలలో ఉర్దూ భాషగా ఉంటుంది, మహ్మదీయం మతంగా ఉంటుంది. 150 కోట్లకు పైగా జనాభా కలిగిన చైనాలో సైతం చైనీస్ ఒకటే అధికార భాషగా ఉంటుంది. అక్కడి ప్రజలను ఒక లైన్‌లో నడిపించడానికి ఆ ఒక్క భాష చాలు. కానీ భారత్‌లో అలా కాదు, ఇక్కడ భాషలకు కొదువలేదు, భావాలకు మితం లేదు, అయితే ఇక్కడ ఉన్న గొప్పతనం ఏంటంటే ప్రధానమంత్రి ఏ భాషలో మాట్లాడినా మిగిలిన భాషల వాళ్ళు ఆ భావాలను అర్థం చేసుకోవడం! కరోనా వైరస్ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ హిందీలో ప్రసంగించినా, దేశమంతా లాక్‌డౌన్ పాటించాలని ఆదేశించినా... వివిధ రాష్ట్రాలలో పలు భాషలు మాట్లాడేవాళ్ళు తూచా తప్పకుండా ఆయన ఆదేశాలను పాటించారు. ఇది దేశ ప్రజల గొప్ప తనం. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలలో లాక్‌డౌన్ ఒకే రీతిలో అమలవుతోంది. ఇది భాషను బట్టి కాదు, మనం పాటిస్తున్న ఆదేశాలను బట్టి అని చెప్పవచ్చు!

కరోనా వైరస్ మూలంగా దేశం ఆర్థికంగా ఎంతో నష్టపోయి ఉండవచ్చు, ప్రాణ నష్టం కూడా జరిగింది. అయినా కూడా మనకు తెలియని, మనం నేర్చుకోవాల్సిన ఎన్నో గుణపాఠాలు నేర్పింది. అన్నిటికి మించి దేశ చరిత్రలోనే తొలిసారిగా అన్ని రాజకీయ పక్షాలు రాజకీయ వైషమ్యాలు మరిచి ఏకతాటిపై నిలిచిన అత్యంత అరుదైన సందర్భం కూడా ఇదేనని చెప్పవచ్చు. దేశంలో ఉన్న 28 రాష్ట్రాలలో పలు పార్టీల, ప్రభుత్వాలు ఉన్నాయి. మెజార్టీ రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో ఉండగా, కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్, మరికొన్ని రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్నాయి. దేశంలో కరోనా వైరస్ ప్రభావం పెరిగి లాక్‌డౌన్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటి నుండి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తున్న తీరు... అలాగే రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వం ముందుకు నడిపిస్తున్న విధానం సమైక్యస్ఫూర్తికి అద్దం పడుతోంది. మామూలు సందర్భాలలో కేంద్రంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు విభేదాలు ఉండేవి, రాజకీయంగా తేడాలు ఉండేవి, కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వాలకు ఏదో ఒక సందర్భంలో వైరం నడుస్తుండేది! కేంద్ర ప్రభుత్వం కూడా తమ పార్టీ రాష్ట్రాల పట్ల ఒక రకంగానూ, తమ పార్టీలు అధికారంలో లేని రాష్ట్రాలతో ఒక రకంగానూ వ్యవహరిస్తుండేది. కానీ, కరోనా వైరస్ పుణ్యమా అని కేంద్ర ప్రభుత్వంతో పాటు వివిధ రాజకీయ పక్షాల ఏలుబడిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఒకే బాటలో నడుస్తున్నాయి. కేంద్రం లాక్‌డౌన్ పిలుపును అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు త్రికరణశుద్ధిగా పాటిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉండబట్టే లాక్‌డౌన్ దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతూ కరోనా కేసుల విషయంలో మిగిలిన దేశాల కంటే గణనీయమైన ఫలితాలను సాధిస్తోంది.

అయితే ఊరందరిదీ ఒకదారైతే.. ఉలిపికట్టెది ఒకదారి అన్నట్లు.. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యవహరిస్తుండడం సమైక్యస్ఫూర్తిలో ఒక ఆటంకంగా చెప్పుకోవచ్చు. ఆమె పశ్చిమ బెంగాల్ భారతదేశంలో ఒక రాష్ట్రం కాదు, కేంద్ర ప్రభుత్వానికి మా రాష్ట్రంతో సంబంధం లేదు అన్నట్లుగా ధిక్కార స్వరంతో వ్యవహరిస్తోంది. కరోనా స్థితిగతులను పరిశీలించేందుకు పశ్చిమ బెంగాల్ వెళ్ళిన కేంద్ర బృందానికి సైతం ఆమె సహకరించడం లేదు. లాక్‌డౌన్ విషయంలో కేంద్ర మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఆమె నడుచుకుంటోంది. దేశంలోని 28 రాష్ట్రాలలో ఒక్క పశ్చిమ బెంగాల్‌తో తప్పితే మిగిలిన అన్ని రాష్ట్రాల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి తలనొప్పులు లేవు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం కరోనాను ఎదుర్కొనే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరిస్తుండడం విశేషం!

దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ సైతం అన్ని రాష్ట్రాలను కలుపుకొనిపోయే విషయంలో చూపిన చొరవ ఎంతో స్ఫూర్తివంతంగా ఉంది. కరోనా వైరస్‌పై పోరాటంలో ఆయన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను సైన్యాధ్యక్షులను చేశాడు. అనునిత్యం ముఖ్యమంత్రులతో సంప్రదింపులు జరిపాడు. వారి సూచనలను స్వీకరించారు. అలాగే ఒకపక్క ఆయా రాష్ట్రాల ఆర్థిక అవసరాలను తెలుసుకుంటూ, వాటికి పరిష్కార మార్గాలను సూచిస్తూ... రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ మార్గాలను పూర్తిగా ధ్వంసం కాకుండా సడలింపు అమలులోకి తీసుకొస్తూ.. అన్ని రాష్ట్రాలతో కలిసి కేంద్రం సాగిస్తున్న ఈ పోరాటం సమైక్య స్ఫూర్తికి పెద్ద మైలురాయిగా భావించవచ్చు. దేశానికి ఆపద వచ్చినప్పుడు ప్రజలంతా కులాలు, మతాలు, భాషల వైషమ్యాలు పక్కనపెట్టి ఒకే మాటపై సమైక్యస్ఫూర్తితో కొనసాగుతారు అనడానికి దీనిని నిదర్శనంగా చెప్పవచ్చు!

కరోనా వైరస్‌పై పోరాటంలో దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ చూపిన చొరవ ఎంతో స్ఫూర్తివంతంగా ఉంది. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను సైన్యాధ్యక్షులను చేశాడు. అనునిత్యం ముఖ్యమంత్రులతో సంప్రదింపులు జరిపాడు. వారి సూచనలను స్వీకరించాడు. అన్ని రాష్ట్రాలతో కలిసి కేంద్రం సాగిస్తున్న ఈ పోరాటం సమైక్య స్ఫూర్తికి పెద్ద మైలురాయిగా భావించవచ్చు. దేశానికి ఆపద వచ్చినప్పుడు ప్రజలంతా కులాలు, మతాలు, భాషల వైషమ్యాలు పక్కనపెట్టి ఒకే మాటపై సమైక్య స్ఫూర్తితో కొనసాగుతారు అనడానికి దీనిని నిదర్శనంగా చెప్పవచ్చు!



• పరిమళించిన మానవత్వం

## చెన్ను దాతృత్వం



పదవుల్లో వున్నా లేకున్నా కష్టకాలంలో తనను నమ్ముకున్న ప్రజలకు తోడుంటారనే మంచి పేరు తెచ్చుకున్న నాయకుడు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ చెన్ను బాలకృష్ణారెడ్డి. గతంలో కరువు కాలంలోనే కాదు నేటి కరోనా కాలంలో కూడా రాపూరు మండలంలోని ప్రజలకు కొండంత అండగా నిలుస్తూ వారి ఇబ్బందులను తొలగిస్తున్నాడు. రాపూరు మండలంలోని 21పంచాయితీలలో 10వేల నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందిస్తున్నారు. లాక్‌డౌన్ మూలంగా ఆయన బెంగుళూరులో వున్నప్పటికీ తన సొంత నిధులతో రాపూరు మండలంలోని పేదకుటుంబాలకు తన సోదరులు చెన్ను తిరుపాల్‌రెడ్డి, చెన్ను భాస్కర్‌రెడ్డిల సహకారంతో స్థానిక అధికారుల ద్వారా పేదలకు పస్తులుండే బాధలేకుండా నిత్యావసర సరుకులను పంపిణీ చేయిస్తుండడం అభినందనీయం.

## 'గీతామయి'లో వృద్ధులకు అన్నదానం

నెల్లూరు నగరంలోని గీతామయి వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు గతనెల 27న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకుడు చేజర్ల సుధాకర్‌రావు అన్నదానం చేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు.




## ఆదర్శంగా నిలుద్దాం

ఈ కరోనా వైరస్ కాలంలో ప్రతి మనిషి కూడా దేశం పట్ల, సాటి మనిషి పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంది. ఏ దేశంలో అయితే మనం బ్రతికి ఉన్నామో... ఆ దేశం కోసం మనం ఎంతోకొంత త్యాగం చేయాల్సిఉంది. కులం, మతం కాదు.. మనం పుట్టి పెరుగుతున్న నేల ఎంతో గొప్పది. ఆ మట్టిని మనం ప్రేమించాలి. ప్రస్తుతం దేశం విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటోంది. లాక్‌డౌన్ మూలంగా ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఎంతోమంది నిరుద్యోగులు అయ్యే పరిస్థితి. అయినా కూడా ముందు మనిషి ప్రాణం ముఖ్యం. ఢిల్లీ నిజాముద్దీన్ సంఘటన ద్వారా కరోనా వైరస్ వ్యాప్తిలో ముస్లింలపై నిందలుపడ్డాయి. కరోనా వైరస్‌ను వ్యాపింప చేయాలని ఎవరూ దుర్మార్గంగా ఆలోచించరు. దీనిని విజ్ఞులు అర్థం చేసుకోవాలి. అలాగే రంజాన్ మాసంలో ఇళ్ళలోనే పవిత్రంగా ప్రార్థనలు చేసి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం లాక్‌డౌన్ అమలుచేయడం ద్వారా వైరస్ పోరాటంలో మనం కూడా భాగస్వాములు కావాలి. సమాజానికి ఆదర్శంగా నిలవాలి.

– ఎస్‌కే నజీర్, కావలి.

## ప్రభుత్వ సేవలు చేసే వారికే... మెడికల్ సీట్లు ఇవ్వండి

మనదేశంలో ప్రభుత్వ వైద్య విధానం అస్తవ్యస్తంగా ఉంది. రిజర్వేషన్ల ముసుగులో కొన్ని వేల కోట్లు ఖర్చు చేస్తున్నా ప్రభుత్వ వైద్య రంగం మెరుగుపడటం లేదు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదివే వారికి, ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేసే డాక్టర్ల సంఖ్యకు పొంతన లేకుండా ఉంది. రిజర్వేషన్ల ద్వారా లేదా ర్యాంకుల ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉచితంగా మెడికల్ సీట్లు పొందిన వాళ్ళు, పీజీలు చేసిన వాళ్ళు డాక్టర్ పట్టాలు అందుకుని ప్రైవేట్ ఆసుపత్రులు స్థాపించుకుని కోట్ల రూపాయలు సంపాదించుకునే పనిలో ఉంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే జీతాలు తీసుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. వైద్యరంగమే డబ్బు మయం అయ్యింది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ఇప్పుడున్న వైద్య విధానంపై దృష్టిపెట్టాలి. ఏ కులం వారైనా, ఏ మతం వారైనా ప్రభుత్వం వైద్యరంగంలో ప్రజలకు సేవ చేస్తామనేవారికే మెడికల్ సీట్ల కేటాయింపులో ప్రాధాన్యతనివ్వాలి.

కె.వి.లక్ష్మి, నెల్లూరు.

## నిర్మాణాలకు సడలింపు ఇవ్వండి

లాక్‌డౌన్ అమలు చేస్తూనే.. నిర్మాణ రంగానికి మాత్రం సడలింపునివ్వడం బాగుంటుంది. నిర్మాణ రంగంలోనే లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు ఉన్నాయి. ఆ రంగంలో పనిచేసే కార్మికులు భౌతిక దూరం పాటించడానికి అవకాశం ఉంటుంది. కొన్ని కనీస జాగ్రత్తలతో నిర్మాణ రంగం మొదలు పెట్టవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో అపార్ట్‌మెంట్లు, భవనాలు ఆగిపోయి ఉన్నాయి. కాబట్టి, దీనివరకు సడలింపునివ్వాలి.

రాజశేఖర్ మొక్కల, నెల్లూరు.



# త్రిశంకు స్వర్గంలో చదువులు

***ఈతరం వారు చూసిన చరిత్రలో చదువుకునేవాళ్ళకు ఈ సంవత్సరం వచ్చిన పరిస్థితి ఎప్పుడూ వచ్చివుండదు. సరిగ్గా విద్యాసంవత్సరం ఆఖరిరోజుల్లో కరోనా వైరస్ ప్రబలడం, లాక్‌డౌన్ అమలులోకి రావడంతో చదువుల లోకం త్రిశంకు స్వర్గంలో వున్నట్లయ్యింది. వైరస్ మూలంగా విద్యా సంవత్సరంలోనే అనూహ్య మార్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.***

1 నుండి 9వ తరగతి వరకు పరీక్షలు జరగకపోయినా, పై తరగతులలో ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా వూపడం తెలిసిందే! కాబట్టి ఈ ఏడాది 1 నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పరీక్షలు వ్రాసే పని లేకుండానే పైతరగతులకు వెళ్ళారు. సరిగ్గా పదో తరగతి పరీక్షలను ప్రారంభించాల్సిన టైంలో లాక్‌డౌన్ వచ్చిపడింది. స్థానిక ఎన్నికల కోసమని పది పరీక్షలను ఒకసారి ఒక వారం పాటు వాయిదా వేస్తే కరోనా వైరస్ మూలంగా అసలు పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. టెన్త్ విద్యార్థులను పరీక్షలు వ్రాయకుండానే ఇంటర్‌కు ప్రమోట్ చేసే పరిస్థితి లేదు. ఒకవేళ జూన్‌లో లాక్‌డౌన్ ఎత్తేసినా వెంటనే పరీక్షలు జరుపుతారా? అన్నది అనుమానమే! టెన్త్ విద్యార్థులకు పరీక్షలు పెట్టాలి, పేపర్లు దిద్దాలి, ఫలితాలు వెల్లడించాలి. జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్‌లు పూర్తిచేయాలి, కాబట్టి సాధారణ సంవత్సరంలో కంటే ఈ సంవత్సరంలో విద్యాసంవత్సరం ఒక ట్రెండు నెలలు ఖచ్చితంగా ఆలస్యమయ్యే అవకాశముంది.

అట్లాగే ఇంటర్ పరీక్షలు ముగిసాయిగాని, పేపర్లు దిద్దలేదు. ఇంటర్ ఫలితాల తర్వాతే డిగ్రీ కాలేజీలలో ప్రవేశాలు, ఎంసెట్, నీట్, ఐఐటి, ఏఐఇఇఇ వంటి ప్రవేశ పరీక్షలు నిర్వహించాల్సి వుంటుంది. కాబట్టి దీనికి సంబంధించిన విద్యా సంస్థలు కూడా రెండు మూడు నెలల తర్వాతే ప్రారంభమవుతాయి. ఈ సమస్యలన్నీ దృష్టిలో పెట్టుకునే యూజిసి(యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్) ఈ సంవత్సరంలో సెప్టెంబర్ నుండి విద్యాసంవత్సరాన్ని ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. మరి దీనిపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందో చూడాలి?

# మేము సైతం... ప్రజాసేవ కోసం

- **నిరంతరాయంగా బ్యాంకుల సేవలు**




ప్రపంచాన్ని కరోనా వైరస్ కమ్మేసి, ప్రజలంతా ఇళ్లకే పరిమితమైన పరిస్థితుల్లో ప్రజలను కరోనా బారి నుండి కాపాడడానికి వైద్యులు, పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులు, అధికార యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుండడం చూస్తూనే వున్నాం. వీరి సేవలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలందుతున్నాయి.

ప్రజలను రోగాలబారిన పడకుండా వీరంతా అందించే సేవలు ఒకెత్తయితే, ఆ మనిషి మనుగడ సాగించడానికి ఆర్థిక లావాదేవీలు కొనసాగడం కూడా మరో ఎత్తు. ఈ ఆర్థిక లావాదేవీలకు మూల కేంద్రాలు బ్యాంకులే! దేశంలో అకస్మాత్తుగా లాక్‌డౌన్ విధించారు. కొందరి వద్ద డబ్బు వుండి అవసరాలు తీర్చుకోవచ్చు, ఇంకొందరి వద్ద డబ్బు లేక అవసరాలు తీర్చుకోలేకపోవచ్చు. కాని ఈ సమస్యకు పరిష్కారం చూపించేవే బ్యాంకులు. ఒకరి నుండి ఒకరికి డబ్బును ట్రాన్స్‌ఫర్ చేయడం, రోజుకు 10 గంటల పాటు పనిచేస్తూ తమ ఖాతాదారులకు నగదు చెల్లింపులు చేయడం, అలాగే వివిధ పథకాల లబ్ధిదారులకు నగదు అందజేయడం వంటి ఆర్థిక సేవలతో ఈ కరోనాకాలంలో కూడా ఆయా బ్యాంకుల ఉద్యోగ సిబ్బంది తమ ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తుండడం ఎంతైనా అభినందనీయం.








నెల్లూరు ముఖద్వారం


కెవిఆర్ పెట్రోల్ బంకు కూడలి


ఆర్టీసీ బస్టాండ్ సెంటర్


అయ్యప్పగుడి సెంటర్


అయ్యప్పగుడి ఫ్లైఓవర్ ప్రాంతం




కరెంట్ ఆఫీస్ కూడలి

## లాక్‌డౌన్‌తో గత 40రోజులుగా మూగబోయిన

# నిశ్శబ్ద నెల్లూరు


ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతం


దర్గామిట్ట ప్రాంతం

కర్కశ కరోనాని నియంత్రించడంలో భాగంగా అమలు చేసిన లాక్‌డౌన్ సందర్భంగా గత 40రోజులుగా మూగబోయిన నెల్లూరు నగరాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించి "లాక్‌డౌన్ నెల్లూరు" పేరుతో వీడియో ద్వారా విడుదల చేసింది 'దీపికాస్ గ్రాఫిక్ పాయింట్'(డిజిపి). ఈ వీడియోని వాట్సాప్, యూట్యూబ్ ద్వారా ఇప్పటికే లక్షలాదిమంది వీక్షించారు. మొత్తం నగరాన్నంతా డ్రోన్ కెమెరాలో బంధించిన దృశ్యాలను తమ పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తోంది 'లాయర్'.


పోలీస్ ఆఫీస్ కూడలి


ఏసి కూరగాయల మార్కెట్టు


శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి గుడి వద్ద


విఆర్‌సి కూడలి


ట్రంకురోడ్డు ప్రాంతం


గాంధీబొమ్మ కూడలి


ఆర్ఆర్ స్ట్రీట్, ఎన్టీఆర్ సర్కిల్


అన్నమయ్య సర్కిల్


చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డు


రంగనాయకుల పేట ప్రాంతం


రైల్వేస్టేషన్


రామలింగాపురం అండర్‌బ్రిడ్జి



# గూడూరు డివిజన్ వార్తలు

## బ్రాహ్మణసేవా సంఘం ఆధ్వర్యంలో
## బియ్యం, సరుకులు అందజేత



ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం గూడూరు శాఖ ఆధ్వర్యంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీకంటి రామ్మోహన్‌రావు దాతృత్వంతో ఇటీవల గూడూరు పట్టణంలోనూ, పరిసరప్రాంతాల్లోనూ ఉన్న పేదబ్రాహ్మణులకు 15 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకంటి రామ్మోహన్‌రావు, సంఘం ఉపాధ్యక్షుడు ఆనిమెళ్ల శివకుమార్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలోను, చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో పూజలు చేసే అర్చకులకు సాయంగా వీటిని అందజేశామన్నారు. తమ సంఘం, ఎస్‌వి రత్నం చారిటీస్ తరపున పేదబ్రాహ్మణులకు ఈ సాయం అందజేస్తున్నామన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో అందరూ ఇళ్ళలోనే ఉండాలని, కరోనా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలని వారు పేర్కొన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో అర్చకులకు ప్రభుత్వం 5వేల రూపాయలు అందజేస్తుందని, ఆ సాయం కోసం అందరూ దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఆదిశంకర బ్రాహ్మణ సంఘం, శ్రీరామరక్ష కుటీరం తరపున చిట్టిబాబు, పవన్, నాగభూషణం పాల్గొన్నారు.

## ప్రగతి సేవా సంస్థ సాయం



ప్రగతి సేవా సంస్థ గూడూరు ఆధ్వర్యంలో బెల్జియంలో ఉన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అనీస్ మరియు వాళ్ళ స్నేహితుల సహాయ సహకారాలతో గత నెల 28వ తేదీన చిల్లకూరు మండలం నక్కలవారికండ్రిగ గిరిజనకాలనీ నందు 570 రూపాయల విలువగల నిత్యావసర ఫలసరుకులను నిరుపేదలు అయిన 30కుటుంబాలకు మాజీశాసనసభ్యులు పాశం సునీల్‌కుమార్ చేతులమీదుగా పంపిణీ చేశారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ యమహా సుబ్రహ్మణ్యం, గ్రానైట్ ప్రభాకర్, కరిముల్లా, ఉదయ్‌శేఖర్‌రెడ్డి, సివిఆర్ న్యూస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన కుటుంబాలకు జెవివి చేయూత



గూడూరులోని జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గత నెల 27న మన పాటి చంటి దాతృత్వంతో నెల్లటూరు వద్ద చెరువుకట్ట కింద ఉన్న గిరిజన కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేశారు. డాక్టర్ చంద్రహాస్ చేతులమీదుగా ఈ సాయం వారికి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రహాస్ మాట్లాడుతూ కరోనా, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో నిరుపేద గిరిజనులు ఇబ్బంది పడకుండా జనవిజ్ఞానవేదిక వారు సేవాభావంతో ఇటీవల పలసరుకులు అందజేశారని, ఇప్పుడు కూరగాయలు కూడా పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. గిరిజనులు కరోనా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్తూ వారికి ఈ వ్యాధి గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, మనోహర్ గౌడ్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మిరెడ్డి మైథిలిరెడ్డి దాతృత్వం




గూడూరు సమీపంలోని చిల్లకూరు మిక్సిడ్ కాలనీ వాసులకు, జాతీయ రహదారిపై గస్తీ కాస్తున్న పోలీసులకు మొత్తం సుమారు 120 మందికి గతనెల 25న బొమ్మిరెడ్డి మైథిలిరెడ్డి దాతృత్వంతో కూరగాయలు పంపిణీ చేశారు. గూడూరులోని ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి, ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు మల్లాబత్తిన జీవనరెడ్డి మాట్లాడుతూ లాక్‌డౌన్ నేపథ్యంలో ఈ ప్రాంతంలోని ప్రజలు కూరగాయలు సరిగా అందక అవస్థలు పడుతున్నారని ఆ ప్రాంతవాసులు మోహన్, ఆర్ముగంలు తమ దృష్టికి తీసుకురావడంతో సంస్థ ఆధ్వర్యంలో తమ వంతు సహాయంగా కూరగాయలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విష్ణువందన,సుప్రియ, వాలంటీర్లు అశోక్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కాగా, చిల్లకూరు మండలం వరగలి క్రాస్‌రోడ్డు, కృష్ణాపురం గిరిజన కాలనీ వాసులకు గతనెల 27న ఆంధ్ర మహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కూరగాయలు పంపిణీ చేశారు. దాత మల్లాబత్తిన జీవనరెడ్డి దాతృత్వంతో ఈ సాయం వారికి అందజేశారు. మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డా. సి.రోహిణి, కార్యదర్శి విష్ణువందన, సుప్రియ, వాలంటీర్లు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధికి 2.87 లక్షలు ఇచ్చిన..
## మెడికల్ అసోసియేషన్



గూడూరు డివిజన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గతనెల 27న కరోనా బాధితుల సహాయార్థం సిఎం సహాయనిధికి 2,87,500 రూపాయలు విరాళం అందజేశారు. గూడూరు సబ్ కలెక్టర్ గోపాలకృష్ణకు ఆ చెక్కులను అందజేశారు. వాటితో పాటు వెయ్యి మాస్కులు కూడా అందజేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రుతుప్రీతమ్, అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ దొడ్ల విష్ణువర్ధన్‌రెడ్డి, గూడూరు ప్రెసిడెంట్ బత్తిన సుధాకర్, అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుభాన్, రఫీ, చెన్నకేశవరావు, కోటేశ్వరరావు, రవి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 250 కుటుంబాలకు కూరగాయలు



గూడూరు 27వ వార్డులో గతనెల 27న పివిఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గూడూరు మునిసిపాలిటీ మాజీ అధ్యక్షురాలు పొణకా దేవసేన, ట్రస్టు వ్యవస్థాపకులు పొణకా శివకుమార్‌రెడ్డి దాతృత్వంతో 250 కుటుంబాల వారికి కూరగాయలు, ఊరగాయలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. మునిసిపల్ కమిషనర్ ఓబులేసు, 27వ వార్డు కౌన్సిలర్ బాలిపోయిన రమేష్, కోదండయ్యలు పాల్గొని ఈ సాయాన్ని అందజేశారు.

## మయూరి శ్యామ్‌యాదవ్ నేతృత్వంలో..
## 70 కుటుంబాలకు కూరగాయలు



గూడూరులోని శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మరియు అంతర్జాతీయ మానవహక్కులు, నేరవ్యతిరేక సేవా సంస్థ రాష్ట్ర కార్యదర్శి మయూరి శ్యామ్‌యాదవ్ దాతృత్వంతో గతనెల 25న 70కుటుంబాలవారికి కూరగాయలు పంపిణీ చేశారు. గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేసు సూచనల మేరకు గూడూరులోని 19, 22 వార్డుల్లో కమిషనర్ చేతులమీదుగా వీటిని పేద కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ ఓబులేశు మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో అందరూ సామాజిక దూరం పాటించాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని అన్నారు. మయూరి శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ కరోనా నివారణకు అందరూ తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. చేతులు తరచూ శుభ్రం చేసుకుంటూ, భౌతిక దూరం పాటిస్తూ ఉండాలని, మాస్కులు ధరిస్తుండాలని, జ్వరం, దగ్గు, జలుబు వచ్చినప్పుడు వ్యాధి నిర్ధారణ కోసం ఆసుపత్రికి వెళ్ళి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కరోనా నివారణకు నిరంతరం ప్రాణాలకు తెగించి పోరాడుతున్న వైద్య సిబ్బంది, పోలీసులు, రెవిన్యూ, మునిసిపల్ సిబ్బంది, పారిశుద్య సిబ్బంది సేవలను ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, రమేష్, సురేష్‌లతో పాటు వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఎస్ఎల్ఎన్ బాబు ఔదార్యం



లాక్‌డౌన్ నేపథ్యంలో పేద బ్రాహ్మణులు ఇబ్బంది పడకుండా గూడూరులోని మహాలక్ష్మి జ్యుయలరీ అధినేత శేగు లక్ష్మీనారాయణబాబు(ఎస్ఎల్ఎన్ బాబు) దాతృత్వంతో ఆయన నివాసంలో బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఎస్ఎల్ఎన్ బాబుతో పాటు ఆయన కుటుంబసభ్యులు సుమంతి, హిమవర్ష, క్రాంతివర్ధన్ చేతులమీదుగా గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ ఆధ్వ ర్యంలో ఈ సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులు సాయం చేసినందుకు ఎస్ఎల్ఎన్ బాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



గత నెల 28వ తేదీన వైస్సార్సీపీ నాయకులు కొండూరు సునీల్ కుమార్ రెడ్డి దాతృత్వంలో గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని చవటపాలెం జడ్పీ హైస్కూల్ నందు చవటపాలెం మరియు సుందరయ్య కాలనీ మహిళలకు 7 రకాల కూరగాయలను పంపిణీ చేస్తున్న గూడూరు శాసనసభ్యులు డా. వెలగపల్లి వరప్రసాద్ రావు

# 2 పంచాయతీలకు కేంద్రం అవార్డులు

-- అధికారులను అభినందించిన కలెక్టర్ --

గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజలకు సేవలందించడంలో ముందున్న పంచాయతీలను ప్రోత్సహిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రతిష్టాత్మక అవార్డులను నెల్లూరు జిల్లాలోని రెండు పంచాయతీలు సాధించాయి. దీంతో ఆయా పంచాయతీల అధికారులను, జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మిని గత నెల 27న జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అభినందించారు.

2017-18 ఆర్థిక సంవత్సరం నుంచి ఉత్తమ సేవలు అందించినందుకు గాను కావలి మండలంలోని రాజువారి చింతలపాళెం(ఆర్.సి పాళెం)కు చైల్డ్ ఫ్రెండ్లీ అవార్డు-2019 లభించింది. ఈ అవార్డు కింద ఆ పంచాయతీకి కేంద్రప్రభుత్వం 5 లక్షల రూపాయలు విడుదల చేసింది. అదేవిధంగా పెళ్ళకూరు మండలంలోని తాళ్వాయిపాడు గ్రామ పంచాయతీని దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ స్వశక్తి కిరణ్ పురస్కార్ -2019 వరించింది. ఈ అవార్డు కింద ఆ పంచాయతీకి కేంద్రప్రభుత్వం 8 లక్షల రూపాయలు విడుదల చేసింది.

## సిఎం సహాయనిధికి..

# 'అపస్మా' 10 లక్షల విరాళం




కరోనా నివారణ నిమిత్తం ప్రభుత్వానికి తమవంతు సాయంగా ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపస్మా) 10 లక్షల రూపాయలను విరాళంగా ప్రకటించింది. గతనెల 27న ఆ విరాళం చెక్కును జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరులోని నేతాజీ పైలట్ స్కూల్‌లో ఆ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డికి అందజేశారు. అపస్మా జిల్లా ఉపాధ్యక్షుడు మైథిలి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామయ్య, కోశాధికారి శ్రీనివాసులు, నగర అధ్యక్షుడు శౌరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, రామమోహన్‌రెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డులో

# ఆక్రమణలు తొలగించిన ఏసు నాయుడు



నెల్లూరు, నవాబుపేటలోనున్న మార్కెట్ యార్డు బయట ఆక్రమణలను నెల్లూరు ఏ.ఎమ్.సి ఛైర్మన్ ఎంబేటి ఏసునాయుడు తొలగింపజేశారు. స్థానిక వ్యాపారుల ఫిర్యాదుతో సోమవారం ఉదయం అక్కడకు చేరుకున్న ఏసు నాయుడు, అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక హోల్‌సేల్ ఫ్రూట్ మార్కెట్ వ్యాపారులతో మాట్లాడారు. కొందరు బయట వ్యక్తులు తమ వ్యాపారాలకు ఆటంకం కలిగించే విధంగా బయట విక్రయాలు జరుపుతున్నారని చెప్పారు. దీంతో స్పందించిన ఆయన వెనువెంటనే ఆక్రమణలను తొలగించారు. ఇకపై ఎవరైనా నిబంధనలకు లోబడి విక్రయాలు జరుపుకోవాలని లేని యెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అర్నాబ్ గోస్వామికి కృతజ్ఞతలు తెలిపిన సోనియా

అది రిపబ్లిక్ టీవీ. రాత్రి 9 గంటల సమయం. దేశవ్యాప్తంగా కొన్ని కోట్లమంది ఆ టైంలో ఈ టీవీలో వచ్చే అర్నాబ్ గోస్వామి డిబేట్ చూస్తున్నారు. జిల్లాలోని టెన్ జన్‌పథ్‌లో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ కూడా ఆ డిబేట్ చూస్తూ ఉంది. ఆమెతో పాటు రాహుల్‌గాంధీ, అంబికా సోని, అహ్మద్‌పటేల్, మల్లికార్జున ఖర్గే, గులాం నబీ ఆజాద్, మనీష్ తివారి, ఆనందశర్మ కూడా ఉన్నారు. అప్పుడే అర్నాబ్ గోస్వామి మొదలుపెట్టాడు. చూసేవారికి అదొక హర్రర్ మూవీ మాదిరిగా ఉంది. మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో జరిగిన ఇద్దరు సాధువుల హత్య సంఘటనపై ఆయన డిబేట్ నిర్వహిస్తూ.. ఈ దాడిని ఖండించనందుకు సోనియాగాంధీని నోరారా తిట్టాడు. ఆమె అసలు పేరు ఆంటోనియో మైనో అని ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ దానికి సంబంధించిన సర్టిఫికెట్లను కూడా చూపించాడు. ఆ దృశ్యాలు చూడగానే సోనియా ముఖంలో రంగులు మారాయి. రాహుల్ సైతం బిక్క మొహం వేసాడు. అక్కడున్న కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ వైపు చూశారు. ఆమెలో బాధపడుతున్న ఆనవాళ్లు వారికి కనిపించాయి. అంతే ఒక్క ఉదుటున వాళ్లంతా అక్కడినుండి లేచారు. తలో దిక్కు వెళ్లిపోయారు.


తెల్లారింది. సోనియాగాంధీ నిద్ర లేచి, ఆరోజు ఉదయాన్నే వచ్చిన దినపత్రికను చేతికి తీసుకుంది. మొదటి పేజీలో ఉన్న వార్తలు చూసి ఆమె ఖంగు తింది. కారణం... అన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల విధ్వంసం. సోనియా గాంధీని ఆమె సొంత పేరుతో పిలిచినందుకు నిరసనగా ఆయా రాష్ట్రాలలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రిపబ్లిక్ టీవీ ప్రతినిధి అర్నాబ్ గోస్వామి దిష్టిబొమ్మను తగలబెట్టారు. వాస్తవంగా అయితే దీనికి నిరసనగా వాళ్లు భారత్‌బంద్‌కి పిలుపునివ్వాలని అనుకున్నారు. అయితే కరోనా వైరస్ మూలంగా నెలరోజులపైనుండి దేశంలో బందుకు మించిన వాతావరణం ఉండడంతో ఆ ప్రయత్నాన్ని మానుకున్నారు. హైదరాబాదులో సోనియా అభిమాన సంఘం అధ్యక్షుడు విహెచ్ హనుమంతురావు అయితే తుపాకీ తలకి గురి పెట్టుకొని సోనియాగాంధీని అవమానించిన అర్నాబ్ గోస్వామి, ఆమె పాదాలు పట్టుకుని క్షమించాలని కోరాడు. లేకుంటే ఈ తుపాకీతో కాల్చుకుని చస్తానని బెదిరించ సాగాడు. అక్కడే ఉన్న ఓ విలేకరి నిజంగా ఆయన కాల్చుకుంటాడేమో అని ఆందోళన పడుతుంటే, ఆ పక్కనే ఉన్న రేవంత్ రెడ్డి మీకు ఆ భయం అక్కర్లేదులే కాంగ్రెస్ నాయకులు ఎప్పుడూ బుల్లెట్లు ఉన్న రివాల్వర్‌లను ఇటువంటి వాటి కోసం వాడరని ధైర్యం చెప్పాడు. ఇక విజయవాడలో పిసిసి అధ్యక్షుడు సాకే శైలజానాథ్ సోనియా గాంధీ చిత్రపటం పట్టుకొని ఏడుస్తూ.. త్యాగమయి, అనురాగమయి సోనియా గాంధీకి అర్నాబ్ గోస్వామి బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలతో రోడ్ల మీదకు వచ్చి లాక్‌డౌన్‌ను ఉల్లంఘిస్తామని, కరోనా వైరస్ వ్యాప్తికి కృషి చేస్తామని బెదిరించాడు. ఢిల్లీలో అయితే కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు తమ ఇంటికి వెళ్తున్న అర్నాబ్ గోస్వామి దంపతులపై దాడికి పాల్పడ్డారు. ఇలా అన్ని రాష్ట్రాలలోనూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి సోనియాగాంధీ పట్ల తమ భక్తిని చాటుకున్నారు.

*****

అది టెన్ జనపథ్. సోనియా గాంధీ దిగులుగా కూర్చుని ఉంది. అప్పుడే అక్కడకు అహ్మద్‌పటేల్, ఆనంద్‌శర్మ, మనీష్ తివారి, గులాం నబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే, దిగ్విజయ్‌సింగ్, కపిల్ సిబాల్, అంబికా సోని, చిదంబరం తదితరులు వచ్చారు. అందరి మొహాల్లోనూ గర్వం, ఆనందం కంబైన్డ్‌గా తాండవిస్తోంది. వేదం వేం సాధించాం... సినిమా చూపించాం... మిమ్మల్ని మీ సొంత పేరుతో పిలిచినందుకు ఈ దేశాన్ని ఆందోళనలతో అతలాకుతలం చేశాం, ఆ అర్నాబ్ గోస్వామికి చుక్కలు చూపించాం. వాడి మీద మనోళ్ళు దాడి చేశారు. ఇక ఏ టీవీ వాడైనా మీ అసలు పేరు ఎత్తి మాట్లాడితే ఏం జరుగుతుందో చేతల్లో చూపించేశాం. కాబట్టి మీరు ధైర్యంగా ఉండండి. ఇక మీ సొంత పేరు పిలిచే ధైర్యం ఎవరూ చేయరని చెప్పారు. ఆ మాటలు వినడంతోనే సోనియాగాంధీ తోక తొక్కిన నాగుపాములా లేచింది. బుద్ధుందా మీకు... మీరు మనిషి పుట్టుకే పుట్టారా... కొంచెం అన్నా సిగ్గు లజ్జ అభిమానం ఉన్నాయా... అర్నాబ్ గోస్వామి ఏం తప్పు చేశాడని అతని మీద దాడి చేశారు. అసలు ఏమి జరిగిందని దేశవ్యాప్తంగా మీరు ఆందోళనలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉండి మీరు చేస్తున్న పని ఇదేనా, నేర్చుకున్న సంస్కారం ఇదేనా? అసలు మీవల్లే కాంగ్రెస్‌పార్టీ అంటే ప్రజల్లో అసహ్యం ఏర్పడింది. కాంగ్రెస్‌ను నిలబెట్టడానికి, తద్వారా మీరంతా రాజకీయ నిరుద్యోగులు కాకుండా ఉండడానికి మేము ఎంతో కష్టపడుతున్నాం. మా కుటుంబం ఎన్నో త్యాగాలు చేసింది. కానీ మీరంతా మా త్యాగాలను బూడిదలో పోసిన పన్నీరులా మారుస్తున్నారని ఆగ్రహంగా అరిచింది. ఊహించని ఆమె రియాక్షన్‌కు ఎంతో ఉత్సాహంతో వచ్చిన కాంగ్రెస్ నాయకులు షాక్‌కు గురయ్యారు. వారిలో దిగ్విజయ్‌సింగ్ ధైర్యం తెచ్చుకొని, అదేంటి మేడం.. ఇది మన పార్టీ సాంప్రదాయం. మన పార్టీ తరఫున అధినేతలను, అది కూడా మీ కుటుంబసభ్యులను ఎవరైనా ఏమైనా అంటే తన్ని తగలెయ్యడమే మాకు నేర్పిన సంస్కృతి. మీరు చూసేఉంటారు... ఇందిరా గాంధీ హత్యకు గురైనప్పుడు కొన్ని వేల మంది సిక్కులను మనవాళ్లు ఊచ కోత కోశారు. రాజీవ్‌గాంధీ గారు హత్యకు గురైనప్పుడు దేశంలో ఉన్న తమిళోళ్లను అందరిని వెతికి వెతికి కొట్టాము. అలాంటిది మీ మీద ఈగ వాలనిస్తామా? మిమ్మల్ని సొంత పేరుతో పిలిచి అవమానిస్తే ఊరుకుంటామా? అని అన్నాడు. దానికి సోనియాగాంధీ మీ అభిమానం ఏడ్చినట్టు ఉంది. నేను ఇటలీ నుండి ఇండియాకి వచ్చాక నా సొంత పేరు ఏంటో మర్చిపోయాను. ఈ కాంగ్రెస్ నాయకులు భజనపరులు. నన్ను ఒక మైకంలోకి తోసేశారు. సోనియా గాంధీ అనే పేరును నాకు శాశ్వతం చేశారు. నేను కూడా ఆ మైకంలో పడిపోయి మా అమ్మానాన్నలు పెట్టిన పేరును పూర్తిగా మర్చిపోయాను. నిన్నటి వరకు ఎవరైనా నా వద్దకు వచ్చి మీ అసలు పేరు ఏంటంటే నేను చెప్పలేని పరిస్థితి. కానీ నాకంటే కూడా అర్నాబ్ గోస్వామి నా అసలు పేరును గుర్తుపెట్టుకుని, నా పట్ల ఎంతో అభిమానం చూపించాడు. కాబట్టి ముందు నేను ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. అసలు ఆయనపై దాడి చేయమని మీకు ఎవరు చెప్పారని అడిగింది. దానికి చిదంబరం... టీవీలో డిబేట్ చూడగానే మీ ఫేస్‌లో కదలికలు మారాయి. అందులో మాకు బాధ కనిపించింది. అందుకే మీ బాధను మా బాధగా అనుకొని ఈ దాడులకు పాల్పడ్డామని చెప్పాడు. దీనికి సోనియాగాంధీ మరింత కోపంగా... మీ మొహాలు మండా... ఆ డిబేట్‌లో నా అసలు పేరు అర్నాబ్ గోస్వామి నోట వినగానే నేను ఆనందంతో మైమరచిపోయాను. నేను మరిచి పోయిన నా బాల్యం, నాకు పేరు పెట్టిన అమ్మానాన్నలు గుర్తుకు వచ్చారు. కాబట్టి నా ఫేస్‌లో అలాంటి కదలికలు కనిపించాయి. మీరు చేసిన పనిని నేను ఎలా సరిదిద్దుకోవాలి?... మీ తరఫున నేను అర్నాబ్ గోస్వామికి క్షమాపణలు చెబుతానంటూ ... వెంటనే ఆయనకు ఫోన్ చేసింది. గోస్వామి ఫోన్ ఎత్తుకోగానే సోనియాగాంధీ ఏడుపు స్వరంతో... తమ్ముడు మీకు కృతజ్ఞతలు. చాలా చాలా చాలా చాలా దశాబ్దాల తర్వాత మీ నోటి మూలంగా నా పేరు నేను తెలుసుకోగలిగాను. మీపట్ల మావాళ్ళు చేసిన తప్పుకు నేను క్షమాపణ కోరుతున్నాను అంటూ ఫోన్ పెట్టేసింది!

## క్వాలిటీ, కొత్తదనమే కొలమానాలుగా..

# గ్రాఫిక్స్‌లో రాణిస్తున్న శ్రీధర్ ఆరణి



*వ్యాపారం విజయవంతంగా జరగాలంటే ప్రచారం అవసరం, ప్రచారం బాగా రావాలంటే ప్రకటన అవసరం, మంచి ప్రకటన తయారు కావాలంటే ప్రతిభ అవసరం. అలాంటి ప్రతిభనే కనపరుస్తూ గత 30 సంవత్సరాలుగా నెల్లూరులో రాణిస్తున్నాడు శ్రీధర్ ఆరణి.*



మద్రాసు విశ్వవిద్యాలయంలో బిఏ ఎకనమిక్స్ పట్టా పుచ్చుకున్న శ్రీధర్, తన చదువుకి సంబంధంలేని వృత్తి పట్ల ఆసక్తితో 1990వ సంవత్సరంలో 'గ్రాఫిక్స్ పాయింట్' పేరుతో టివితో పాటు సినిమాహాళ్లలో ప్రదర్శించే ప్రకటనల రూపకల్పనకు శ్రీకారంచుట్టి, ఆనతికాలంలోనే మంచి గుర్తింపును సాధించాడు. దశాబ్ద కాలం తరువాత 2000 సంవత్సరం నుండి తన సంస్థకు 'దీపికాస్ గ్రాఫిక్ పాయింట్'గా పేరు మార్చి, ఈ 3 దశాబ్దాల సుదీర్ఘకాలంలో ఎన్నో ప్రతిష్టాత్మక సంస్థలకి ప్రకటనలతో పాటు షార్ట్‌ఫిల్ములు, కార్పొరేట్ ప్రజంటేషన్లు చేయడమే కాకుండా పలు దేవస్థానాల బ్రహ్మోత్సవాల తరుణంలో డ్రోన్ కెమెరా ద్వారా అద్భుతమైన దృశ్యాలను చిత్రీకరించాడు. కనుపూరు ముత్యాలమ్మ జాతర, వేంకటగిరి పోలేరమ్మ జాతర వంటివి వీటిలో ముఖ్యమైనవి. పలు సందర్భాలలో దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి, భారతీయ సినిమా గాయకులు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం వంటి అనేకమంది ప్రముఖుల ప్రశంసలు కూడా అందుకున్నాడు.

### ఆకట్టుకుంటున్న 'లాక్‌డౌన్ నెల్లూరు' డ్రోన్ దృశ్యాలు

కరోనా కట్టడి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న లాక్‌డౌన్ సందర్భంగా మూగబోయిన నెల్లూరు నగరం మొత్తాన్ని డ్రోన్ ద్వారా చిత్రీకరించి 'లాక్‌డౌన్ నెల్లూరు' పేరుతో శ్రీధర్ రూపొందించిన వీడియో ఇప్పుడు విశేష ప్రాచుర్యాన్ని సాధించి ప్రపంచవ్యాప్తంగా వున్న లక్షలాది మంది నెల్లూరీయులను ఆకట్టుకుంది. కరోనా తరుణంలో ప్రజలను చైతన్యవంతులను చేస్తూ గ్రాఫిక్స్ పాయింట్ రూపొందించిన అనేక సందేశాత్మక వీడియోలు టీవీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయి.

నిత్యం కొత్తదనం కోసం తపిస్తూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న విప్లవాత్మక మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ.. తన సంస్థ దీపికాస్ గ్రాఫిక్ పాయింట్‌ను విజయపథంలో నడిపిస్తున్న శ్రీధర్ ఆరణికి 'లాయర్' అభినందలు.




ఏప్రియల్ 30వ తేదీ ఇస్కాన్ మందిరానికి గాను సుకదేవ స్వామికి శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని భక్తితో అందజేస్తున్న నెల్లూరు మున్సిపల్ కమిషనర్ పి.వి.యస్.యస్.మూర్తి, పక్కన మేనేజర్ రాజేశ్వరి, ఆర్.ఐ కృపాకర్, సమన్వయకర్త మైపాడు రాజా

## కరోనా సైనికులకు...

# ఆర్‌ఎస్‌ఆర్ చేయూత



నెల్లూరు 21వ డివిజన్‌కు చెందిన వైసిపి నాయకులు ఆర్.శ్రీనివాసరావు (ఆర్‌ఎస్‌ఆర్) ఈ కరోనా కాలంలో నిరంతరం కరోనా వైరస్‌తో పోరాడుతున్న మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, మున్సిపల్ వాటర్ పంప్‌హౌస్ ఆపరేటర్లు, బి.వి.నగర్ సబ్‌స్టేషన్ సిబ్బందికి తన చేయూతనందించాడు. ప్రజాసేవలో ఉన్న వారికి వాళ్ళ ఇంటి అవసరాలు తీర్చే విధంగా బియ్యం, పప్పుదినుసులు, నిత్యావసర వస్తువులు మరియు కూరగాయలను తన సొంత నిధులు వెచ్చించి గత నెల 29వ తేదీన పంపిణీ చేశాడు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు చేజర్ల మహేష్, ఏడిఇ అల్తాఫ్, ఏ.ఇ మనోహర్, దిలీప్‌రెడ్డి, రాజారెడ్డి, పిచ్చిరెడ్డి, కిషోర్, ఒంగోలు సురేష్, పోతురాజు రవి, పామంజి రమణయ్య, శీను తదితరులు పాల్గొన్నారు.



గురువారం నెల్లూరు మూలాపేటలోని శంకరమఠం నందు కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులతో నిరుపేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులు మరియు కూరగాయలు అందజేస్తున్న శంకర మఠం మేనేజర్ కొర్రపాటి నందకిషోర్, దాతలు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, దూబగుంట గౌరీశంకర్



మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్వేపల్లి నియోజకవర్గంలో పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న తెలుగుదేశం కార్యకర్తలు

## కాలధర్మం

# పట్నం మురళీ రాజేశ్వరమ్మ



నెల్లూరు వి.ఆర్.కళాశాలలో బోటనీ విభాగాధిపతిగా పనిచేసి, ఎన్నో లక్షల మంది విద్యార్థులకు విద్యాబోధన చేసిన శ్రీమతి పట్నం మురళీ రాజేశ్వరమ్మ ఏప్రిల్ 22వ తేదీన చెన్నైలో అనారోగ్యంతో దివంగతురాలైనారు. ఆమె వయసు 72 సంవత్సరాలు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. రాజేశ్వరమ్మ ఒకటో తరగతి నుండి డిగ్రీ వరకు వి.ఆర్ విద్యాసంస్థల్లోనే చదివారు. 40ఏళ్ళ పాటు అధ్యాపకురాలిగా సేవలందించారు.

వి.ఆర్ విద్యాసంస్థలతో విద్యార్థినిగా, అధ్యాపకురాలిగా 65ఏళ్ళ అనుబంధం ఆమెది. మెగాస్టార్ చిరంజీవి, మాజీమంత్రి, నారాయణ విద్యాసంస్థల అధినేత పి.నారాయణ, రత్నం మాష్టారు వంటి మేధావులు ఆమె శిష్యులు. నెల్లూరులో రత్నం, కోరా, నారాయణ, చంద్రారెడ్డి కాలేజీలలో కూడా ఆమె అధ్యాపకురాలిగా విద్యాబోధన చేశారు. పలు యూనివర్శిటీలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా వ్యవహరించారు. ఆమె మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## భద్రం అబ్బయ్యో!...

నీ అడుగుల ఆరాటం
ఉరకలేస్తున్న ఉత్సాహం
గడప దాటుతుంటే
నా అనుకునే కళ్ళు
మౌనంగా రోదిస్తున్నాయ్!..
అడుగు బయటపెడుతుంటే
అభద్రతా భావంతో
ఆందోళనగా చూస్తున్నాయ్!..
కాలు కదిపితే లాఠీ ఝళిపించి
దండించాల్సిన చేతులే
నీకు దండం పెడుతున్నాయ్!..
ఇంట్లోనే ఉండాలని అర్థిస్తున్నాయ్!..
కరోనా కబంధహస్తాలు
ఎక్కడ నిన్ను లాక్కుంటాయోనని
ఆ ధృతరాష్ట్ర కౌగిలి
నిన్ను ఎక్కడ బంధిస్తుందోనని..
కంటికి కనిపించని ఆ రాకాసి
ఎక్కడ కబళిస్తోందనని...
అవకాశం కోసం
ఎదురుచూస్తోందా మహమ్మారి
ప్రపంచాన్ని స్మశానంగా మార్చాలని!...
నీ ఆదమరుపే దానికి అస్త్రం
అర్పించుకుంటావా నీ సమస్తం?...
నిన్ను పుట్టించిన ఆ దేవుడే
తలుపులు మూసుకుని
హోం క్వారంటైన్‌లో కాలం వెళ్ళదీస్తుంటే
ఎవరికోసం నీ పరుగు?
ఎందుకు నీకీ ఉబలాటం?..
అయినా.. కాలు బయటపట్టేందుకు
కారణాలు వెతుకుతావా?
అంతా తెలుసుకునే లోపే
ఆరడుగులు నిన్ను ఆహ్వానిస్తాయ్!..
భద్రం అబ్బయ్యో!...



- డా. కనియంపాటి రామకృష్ణ
నెల్లూరు. 96189 38327

# సడలింపులతో.. పొడిగింపు

భారత్‌లోనూ కరోనా తీవ్రత పెరుగుతున్న తరుణంలో లాక్‌డౌన్‌ను మరి కొన్ని రోజుల పాటూ కొనసాగించడానికి కేంద్రప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈమేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి లాక్‌డౌన్‌పై వారి అభిప్రాయాలు తీసుకున్నారు. కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు లాక్‌డౌన్ పొడిగింపుకే మొగ్గుచూపారు.

దేశంలో లాక్‌డౌన్ అమలులోకి వచ్చి నెలరోజులు దాటినా వైరస్ వ్యాప్తి ఆగలేదు. కాకపోతే యూరప్ దేశాలలో మాదిరిగా వేగం లేదు. లాక్‌డౌన్ మూలంగా మనం మంచి ఫలితాలే సాధించాం. లేకుంటే ఈపాటికే లక్షల్లో కేసులు నమోదై దేశంలో గందరగోళ పరిస్థితులు నెలకొని వుండేవి.

చాలా రాష్ట్రాలలో వైరస్ వేగం మందగించినా మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ, యూపీ, తమిళనాడులలో వైరస్ తీవ్రత కలవరపెడుతోంది. లాక్‌డౌన్ ఏ మాత్రం తీసేసినా మహారాష్ట్ర మరో ఇటలీగా మారడం ఖాయం. కాబట్టి ఇంకొన్ని రోజులు కష్టమైనా నష్టమైనా ఇండియా ఇంటికే పరిమితం కాకతప్పదు!

### సడలింపులతో ఉపశమనం..

అయితే, ఈ దఫా లాక్‌డౌన్‌లో మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సడలింపులకు పెద్దపీట వేస్తున్నాయి. మరీ ప్రతిసారీ లాక్‌డౌన్‌ను పొడిగిస్తూ ఉంటే ప్రజల్లో విసుగొస్తుంది. కరోనా వైరస్ విస్తరించే అవకాశాలు లేనటువంటి ఆయా రంగాలకు ఉపశమనం ఇస్తే... ఆర్థికంగా ఆ రంగాలు తిరిగి ప్రయాణాన్ని ప్రారంభించే అవకాశముంటుంది. ఎక్కువ మందికి పనులు కూడా దొరుకుతాయి. ప్రభుత్వం మీద ఆధారపడే బాధ తప్పుతుంది. ఈ కోణంలోనే ఈసారి పెద్దఎత్తున ఆయా రంగాలకు సడలింపులను ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వ్యవసాయ, ఉద్యానవన రంగాలకు పూర్తిస్థాయిలో మినహాయింపులివ్వబోతున్నారు. పలు రాష్ట్రాలలో ఇతర ప్రాంతాలకు చెందిన వలస కూలీలు, అలాగే విద్యార్థులు లాక్‌డౌన్ మూలంగా ఇరుక్కొపోయి వున్నారు. 40రోజులుగా వాళ్ళు అక్కడ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారందరినీ సొంత ప్రాంతాలకు తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. వారందరికీ కరోనా పరీక్షలు నిర్వహించిన తర్వాత వ్యక్తిగత వాహనాలలో వారి ప్రాంతాలకు చేర్చే అవకాశముంది. వీరి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక వాహనాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఇక పెద్దసంఖ్యలో ఉద్యోగులు, కార్మికులతో అవసరం లేని పరిమిత సంఖ్యలో సిబ్బందితో పనిచేయించగల అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వ్యాపార సంస్థలకు, దుకాణాలకు సడలింపులివ్వనున్నట్లు తెలుస్తోంది. విమానయానం, రైల్వే, ఆర్టీసీ వంటి పబ్లిక్ రవాణాతో పాటు సినిమాహాళ్ళు, షాపింగ్ మాల్స్, పార్కులు, కళ్యాణ మండపాలు వంటి ప్రజాసమూహం గుమికూడే వ్యాపార వాణిజ్య కార్యకలాపాలకు అప్పుడే అనుమతి రాకపోవచ్చు. కాబట్టి ఈసారి సడలింపులతో కూడిన లాక్‌డౌన్ ప్రజలకు కాస్త రిలీఫ్‌గానే ఉండబోతోంది.

# మారుతున్న భారతం

(మొదటి పేజీ తరువాయి)

బాగా విజృంభిస్తున్నా మనదేశంలో ముందుజాగ్రత్త చర్యగా తీసుకున్న లాక్‌డౌన్ నిబంధనలతో ఆ వ్యాధి ఉధృతి, మరణాల సంఖ్య తగ్గిందని చెప్పవచ్చు. అందుకు ముఖ్యంగా మన ప్రధాని మోడీని, కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలతో పాటు, ఈ వ్యాధి నివారణకు ముందు వరుసలో ఉండి వీర సైనికులై అనుక్షణం పోరాడుతున్న వైద్యులు, వైద్యసిబ్బందితో పాటు, వైరస్ వ్యాప్తి కాకుండా కాపాడుతున్న పారిశుద్ధ్య సిబ్బంది, ఎప్పటికప్పుడు ముందస్తు హెచ్చరికలు చేస్తూ ప్రజలను రక్షిస్తున్న పోలీసులు, అధికారులందరూ అభినందనీయులు.

### లాక్‌డౌన్‌తో ఎంతో మేలు

కరోనా రక్కసి ప్రమాదఘంటికలు మోగిస్తున్న ఈ సమయంలో, ఆ కంటికి కనిపించని సూక్ష్మరాకాసి వైరస్‌కు అందకుండా అందరూ ఇళ్ళలోనే ఉంటూ జాగ్రత్తలు తీసుకోవడం, లాక్‌డౌన్ ఆయుధంతో ఆ మహమ్మారిని నివారించడం.. 'స్టే హోం, స్టే సేఫ్'.. అంటూ.. 'ఇంట్లో ఉండండి.. సురక్షితంగా ఉండండి'.. అనే ఏకైక నినాదంతో ఈ నిశ్శబ్ద యుద్ధంలో ప్రతి ఒక్కరూ ఒక్కో సైనికుడై కరోనా రాకాసి సంహారానికి పోరాడుతుండడం ప్రపంచానికే స్ఫూర్తిదాయకం.

### నాటికీ నేటికీ సాటిలేనిది..
### మన ప్రాచీన సంస్కృతి :

కరోనా వైరస్ వంటి సూక్ష్మ వైరస్‌లు మనకు సోకకుండా, వ్యాధి నిరోధక శక్తితో ఎలాంటి వైరస్‌లనైనా జయించవచ్చని చాటిచెప్పడమే కాక, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో హాయిగా ఉండాలని కోరుకుంటూ ప్రాచీనకాలం నుంచి మన మహర్షులు, పెద్దలు ఎన్నో సూచనలు చేసి వున్నారు. ఎంతో అనుభవంతో చెప్పిన ఆ ఆరోగ్యసూత్రాలను పాటించడం ద్వారా ఇలాంటి మహమ్మారి వ్యాధుల్ని అరికట్టవచ్చని ఈ లాక్‌డౌన్ పుణ్యమా అని నేటితరం వారికి కూడా బాగా తెలిసొస్తోంది. ప్రాచీన కాలం నుంచీ ఉన్న మన సంస్కృతి సంప్రదాయాలు ఎంత గొప్పవో... ఎంత అమూల్యమైనవో ఇప్పుడు అందరూ అవగాహన చేసుకుంటున్నారు. ఎంతోమంది మళ్ళీ ఆ బాట పట్టి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తమ జీవనవిధానాన్ని మార్చుకుంటున్నారు.

### నమస్కారమే మంచి సంస్కారం

షేక్‌హ్యాండ్ ఇవ్వడమనే పాశ్చాత్య సంస్కృతి వల్ల ఎన్ని ఇబ్బందులున్నాయో, రెండుచేతులెత్తి ఒకరికొకరు నమస్కరించుకోవడమనే సంస్కారం ఎంత గొప్పదో అందరికీ అర్థమవుతోంది. తరచూ చేతులు శుభ్రంగా కడుక్కోవడం, ముఖ్యంగా అన్నం తినే ముందు చేతులు కడుక్కోవడం, తరచూ ఉప్పునీటితో పుక్కిలించి నోటిని శుభ్రపరచుకోవడమన్నది మనదేశంలో ప్రాచీనకాలం నుంచి వస్తున్న అలవాటు. కరోనా వంటి వైరస్‌లు అంటుకోకుండా చేతులు శుభ్రంగా కడుక్కోవడం తప్పనిసరి అన్నది ఇప్పుడు ప్రపంచ నినాదమైంది.

### యోగాతో ఎంతో ఆరోగ్యం :

ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగాను ప్రపంచానికి పరిచయం చేసింది మన ప్రాచీనకాలం నాటి మహర్షులే. వేనవేల సంవత్సరాల నాటి ప్రాచీనమైన ఉపనిషత్తుల్లో కూడా యోగా గురించిన అనేక విషయాలున్నాయి. సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, ఇంకా యోగాలోని అనేక ఆసనాల ద్వారా ఆరోగ్యానికి ఎంత రక్షణో, యోగా మానవాళికి ఎంత ఉపయోగకరమైనదో అన్నీ వివరించి వున్నాయి. అంతేకాదు, ఎలాంటి ఆహారం తింటే ఆరోగ్యానికి మంచిదో, ఎలాంటి ఆహారం తినకూడదో వేద కాలం నుంచీ మన మహర్షులు లోకానికి చాటివున్నారు.

### వంటింట్లో పోపులపెట్టే..
### మెడికల్ కిట్ :

ఆయుష్షును పెంచే ఆయుర్వేదం భారతీయుల సొత్తు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు, ఎలాంటి వైరస్‌లనైనా ఎదుర్కొనేందుకు పుష్టికరమైన ఆహారం అత్యవసరమన్నది మన పెద్దలు చెప్పనే ఉన్నారు. అంతెందుకు నేటికీ మన వంటిళ్ళల్లో ఉన్న పోపులపెట్టే ఆరోగ్యానికి దివ్యౌషధం. వంటిల్లే ఒక ఔషధాలయంగా, పోపులపెట్టే ఒక మెడికల్ కిట్‌గా ఇప్పటికీ మనదేశంలో అందరికీ ఉపయోగపడుతూనే ఉంది. వ్యాధులను నివారించి ఆరోగ్యాన్ని ప్రసాదించే ఎన్నో రకాల దినుసులు.. పసుపు, ధనియాలు, మిరియాలు, వాము, శొంఠి, పట్టా లవంగాలు, ఇంగువ, ఉల్లి, వెల్లుల్లి, కారం, ఉప్పు పప్పుతో పాటు అనేక రకాల కూరగాయలు, దివ్యమైన ఆకుకూరలు ఆరోగ్యానికి అమూల్యమైన ఔషధాలే. ఎన్నో రకాల చెట్లు, ఆకులు, పండ్లు మన ఆహారంలో నిత్యకృత్యమయ్యాయి.

'కరోనా వ్యాక్సిన్ మనచేతుల్లోనే ఉంది' అంటూ శాంతా బయోటెక్నిక్స్ అధినేత కెఐ వరప్రసాద్‌రెడ్డి ఏప్రిల్ 17న 'లాయర్'కు రాసిన ప్రత్యేక వ్యాసంలో మన ప్రాచీనమైన పద్ధతులు, ఆచారాలు సంప్రదాయాలు ఎంత గొప్పవో, కరోనా మహమ్మారి నుంచి బయటపడాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో అన్నీ అత్యద్భుతంగా వివరించి ఉన్నారు.

అయినా, ప్రకృతి మనకు అన్నీ ఇచ్చింది. మన ఆరోగ్యానికి ఏమి అవసరమో నేలతల్లి అన్నీ సమకూరుస్తూనే ఉంది. వాటిని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండడమే మన కర్తవ్యం. అలా కాక పిజ్జాలు, బర్గర్లు, వేళాపాళాలేని డిన్నర్లు, ఉడికీ ఉడకని మసాలా కూరలు వగైరాలతో చేజేతులా ఆరోగ్యాన్ని నాశనం చేసుకోకుండా ఇప్పటికైనా మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ఇలాంటి ఆరోగ్యకరమైన విషయాలను ఆచరణలో పెట్టేందుకు ఇప్పుడు లాక్‌డౌన్ ఎంతగానో ఉపయోగపడుతోంది.

### ఆరోగ్యకరమైన సమాజమే అందరి ధ్యేయం కావాలి :

ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు అందరి దృష్టి భారత్‌పైనే ఉంది. మన ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు, జీవన విధానాలు ఎంత గొప్పవో తెలుసుకుని ప్రపంచం ఆశ్చర్యపోతోంది. అందుకు అనుగుణంగా ప్రతి భారతీయుడు పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ మన వంటిని, ఇంటిని, పరిసరాలను అన్నిటినీ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇప్పటికే స్వచ్ఛభారత్ పేరుతో ప్రభుత్వం కోట్లాది రూపాయలను పరిశుభ్రతకు వెచ్చిస్తోంది. పరిసరాలను పరిశుభ్రం చేసుకుంటూ, ప్రకృతిని కాపాడుకుంటూ ఆరోగ్యకరమైన సమాజానికి శ్రీకారం చుట్టాలి. ఆరోగ్యకరమైన సమాజమే అందరి ధ్యేయం కావాలి.. అందుకు ఇంతకంటే మంచి తరుణం మరొకటి ఉండదు.

ఏదేమైనా.. ప్రజల భరతం పట్టాలని వచ్చిన కరోనా మహమ్మారి భరతం పట్టడానికి కృషి చేసే తరుణంలో భారతావని మారుతోంది. మన ప్రాచీనమైన సంస్కృతి సంప్రదాయాల బాటపడుతూ ఆరోగ్యకరమైన జీవనానికి మళ్ళీ పునాదులు వేసుకుంటోంది!

# ఇంకొన్నాళ్ళు... మనతోపాటే కరోనా

***ప్రపంచ చరిత్రలో పుట్టిన ఏ వైరస్ కూడా పూర్తిగా అంతరించిపోలేదు. కాకపోతే వాటికి వ్యాక్సిన్‌లు, మందులు కనిపెట్టడం వల్ల అదుపులో వుంచగలుగుతున్నామంతే! ఇప్పుడు ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ కూడా అలాంటిదే! ఈ వైరస్‌ను పూర్తిగా నిర్మూలించడం అన్నది అయ్యేపని కాదు. కాకపోతే ఈ వైరస్‌కు విరుగుడుగా వ్యాక్సిన్‌లు, మందులు వచ్చేవరకు ప్రపంచ మానవాళి జాగ్రత్తగా వుండాలంతే!***

ఇప్పటిదాకా వచ్చిన పలు వైరస్‌లు లాగే కరోనా వైరస్ కూడా ప్రపంచ జనజీవనంలో ఒక భాగంగా వుండబోతోంది. ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇదే చెప్పింది. ప్రధాని నరేంద్ర మోడీ కూడా కరోనా వైరస్‌తో సుదీర్ఘపోరాటం చేయక తప్పదని సెలవిచ్చాడు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కూడా కరోనాతో కలిసి కొనసాగక తప్పదని చెప్పడం జరిగింది. సమాజంలో ఇంతవరకు ప్రబలిన అన్ని ప్రాణాంతక విషజ్వర వైరస్‌ల మాదిరిగానే కరోనా కూడా శాశ్వత మనుగడ సాగించబోతుందన్నది నగ్నసత్యం. అయితే దీనికి వ్యాక్సిన్, ఔషధాలు వచ్చేవరకు మనుషులు స్వీయ జాగ్రత్తలు పాటించకతప్పదు.

దాదాపు 10కిపైగా దేశాలలో కరోనా వ్యాక్సిన్ కనుగొనేందుకు విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్నాయి. చైనాలో అయితే వ్యాక్సిన్ క్లినికల్ ప్రయోగ దశను దాటి మనుషుల మీద ప్రయోగాలు చేస్తున్నారు. భారత్‌లో సైతం వ్యాక్సిన్ ప్రయోగం వూపందుకుంది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో కలిసి సీరం అనే భారతీయసంస్థ సెప్టెంబర్‌కల్లా వ్యాక్సిన్ ఉత్పత్తిని ప్రారంభిస్తామని ప్రకటించి ఆశాజనక వాతావరణాన్ని నెలకొల్పింది. జర్మనీ, జపాన్, దక్షిణకొరియా, రష్యా, అమెరికా వంటి దేశాలు సైతం వ్యాక్సిన్ కనుగొనే ప్రయత్నాల్లో తలమునకలై వున్నాయి. కాని ఈ వ్యాక్సిన్ ప్రపంచానికంతా అందుబాటులోకి రావాలంటే 6నెలల నుండి ఏడాది సమయం పట్టొచ్చు. అప్పటిదాకా కరోనాకు ఎదురొడ్డి నిలవడం కాదు, తప్పించుకు తిరగడమే మనిషి చేయాల్సినపని.


# నెల్లూరు కుదుటపడేనా?



కరోనా వైరస్ మూలంగా లాక్‌డౌన్ అమలులోకి వచ్చి 40రోజులయ్యింది. మరోసారి లాక్‌డౌన్ పొడిగించడానికి అవకాశాలు మెరుగ్గా వున్నాయి. లాక్‌డౌన్ వల్లనే కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడం సాధ్యమవుతున్న తరుణంలో ప్రజలు కూడా లాక్‌డౌన్‌కు సంపూర్ణ మద్దతునిస్తున్నారు.

నెల్లూరుజిల్లా వ్యాప్తంగా లాక్‌డౌన్ కట్టుదిట్టంగా అమలవుతోంది. నిబంధనలు కఠినతరం చేశారు. అవసరం లేకుండా రోడ్ల మీదకొచ్చే వాహనదారులపై కొరడా ఝళిపిస్తున్నారు. ముఖానికి మాస్క్‌లేకున్నా, అతయవసర పని కాకపోయినా రోడ్ల మీదకొస్తున్న వాహనదారులను భారీ జరిమానాలతో పోలీసులు కుమ్మేస్తున్నారు. నగరాలు, పట్టణాలలో అధికారులు, పోలీసులు కలిసి లాక్‌డౌన్‌ను కట్టుదిట్టంగా అమలు చేస్తుంటే, గ్రామాలు, పల్లెటూర్లలో మాత్రం స్థానిక ప్రజలే లాక్‌డౌన్ నిబంధనలను నిక్కచ్చిగా అమలు చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారిని తమ గ్రామాల్లోకి రానీయడం లేదు. వచ్చినా వాలంటీర్లకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇక జిల్లాలో కరోనా వేగం కాస్త నెమ్మదించినట్లుగానే వుంది. కర్నూలు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో దూకుడుగా వుంది. గతనెల 30వతేదీ ఉదయానికి జిల్లాలో మొత్తం 84 కేసులుండగా, ఇందులో 27మంది డిశ్చార్జ్ అయ్యారు. 55 మంది రోగులు కోవిడ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇకముందు గుట్టలుగుట్టలుగా కేసులు రాకుంటే ఈ ముప్పు నుండి కొంచెం బయటపడ్డట్లే!

## కరోనా రోగుల సేవలో...
# నెల్‌బోట్




కరోనా రోగులున్న ఐసోలేషన్ వార్డుల్లో సేవలందించాలంటే ఎవరికైనా కత్తిమీద సామే! మృత్యువుతో చెస్ ఆడుకోవడమే! అయినా కూడా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ప్రాణాలకు తెగించి రోగులకు సేవలందిస్తున్నారు.

ఇలా ఎంతో ధైర్యసాహసాలతో వైద్యసేవలు అందిస్తున్న వైద్య బృందానికి వెన్నుదన్నుగా నిలిచేందుకు ఏపిఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఒక రోబోను రంగంలోకి దించింది. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆశయం మేరకు ఏపిఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకుడు సయ్యద్ నిజాముద్దీన్ తన మేనల్లుడు సయ్యద్ పర్వేజ్ ద్వారా లక్షలాది రూపాయల ఖర్చుతో కోవిడ్ రోబోను తయారు చేయించాడు. 28వ తేదీన నెల్లూరు జడ్పీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, కోవిడ్ స్పెషల్ ఆఫీసర్ బి.రామ్‌గోపాల్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.వినోద్‌కుమార్ లకు ఈ రోబోను అందజేశారు. నెల్లూరు పేరు కలిసివచ్చేలా ఈ రోబోకు 'నెల్‌బోట్' అనే పేరు పెట్టారు. కరోనా రోగుల దగ్గరకు వైద్యులు, నర్సులు ప్రతిసారి వెళ్లే అవసరం లేకుండానే ఈ రోబో ద్వారా మందులను, పత్రికలను, కేస్ షీట్లను చూపించవచ్చు. దీంట్లో అమర్చిన ఐపాడ్ ద్వారా రోగులు తమ సమస్యలను వైద్యులకు తెలియపరచవచ్చు. కరోనా రోగుల సేవ కోసం ప్రత్యేకంగా రోబోను తయారు చేయించిన నిజాముద్దీన్‌ను, సయ్యద్ పర్వేజ్‌ను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అభినందించారు. కరోనా రోగుల సేవకు మరో 4 రోబోలు అవసరమవుతాయని కలెక్టర్ కోరిన నేపథ్యంలో త్వరలోనే వాటిని అందిస్తానని నిజాముద్దీన్ వెల్లడించారు.

## విస్తృతంగా ర్యాపిడ్ పరీక్షలు

జిల్లాలో కరోనా మహమ్మారి వ్యాధిని నిర్ధారించేందుకు విస్తృతంగా ర్యాపిడ్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పద్ధతిలో ఐజిఎం, ఐజిజి యాంటీ బాడీస్ పరీక్షలు చేస్తున్నారు. వీటి ఫలితాలు కేవలం 10నుంచి 15 నిమిషాల్లోనే వస్తున్నాయి. వీటిలో పాజిటివ్ వచ్చిన వారిని ట్రూనాట్ పరీక్షల ద్వారా మరోసారి నిర్ధారిస్తారు. కరోనా బాధితులను గుర్తించేందుకు ఈ పరీక్షలు ఉపయోగపడుతున్నాయి.


## 6వ వర్ధంతి



జననం
09.09.1964

మరణం
06.05.2014

మా ఇంటి ఆశాదీపం
### జక్కా రామ్‌మోహన్‌రెడ్డి
పరమపదించి తే. 6.5.2020ది నాటికి ఆరు సంవత్సరాలు గడుస్తాయి.
వారి దివ్యస్మృతిలో...

నానమ్మ : జక్కా కామేశ్వరమ్మ

నాన్న : జక్కా కోదండరామిరెడ్డి
మాజీ శాసనసభ్యులు
అమ్మ : జక్కా సులోచనమ్మ

భార్య : జక్కా వినుజరెడ్డి
కుమార్తె : జక్కా రిధిరెడ్డి
కుమారుడు : జక్కా మనవ్‌రెడ్డి

తమ్ముడు : జక్కా జనార్ధన్‌రెడ్డి
మరదలు : జక్కా స్మితరెడ్డి
తమ్ముని కుమారుడు : జక్కా కోదండ శ్రీవత్స

చెల్లెలు : పద్మజ
బావ : ఎ.బి.వి.రమణారెడ్డి
చెల్లెలి కుమార్తెలు : ప్రియదర్శిని వెంకట్, యామిని వెంకట్


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com